

T.V. Reddy A.M.T.E Sec

15



వాహినీ పిక్చర్సు వారి విడుదల

J. Vidyullata



నిర్వాహకులు

కథ, మాటలు, పాటలు.	—	పింగళి నాగేంద్రరావు
సినిమా అనుకరణ	—	కె. వి. రెడ్డి B. Sc. (Hons)
ఛాయాగ్రహణ దర్శకుడు	—	K. S. ప్రసాద్
కెమేరా	—	T. R. రాజరత్నం
శబ్దగ్రహణ దర్శకుడు	—	A. కృష్ణన్ B. A,
రికార్డింగ్	—	T. S. కృష్ణ B. Sc.
ఎడిటింగ్	—	M. S. మణి, T.R.R. అమాత్య
సంగీతము	—	ఘంటసాల వెంకటేశ్వరరావు
కళ	—	తోట వెంకటేశ్వరరావు
నృత్యము	—	పసుమర్తి కృష్ణమూర్తి
మేకప్	—	హరిబాబు, S. S. R. మూర్తి ధనకోటి, C. నాగేశ్వరరావు
నిర్వహణ	—	S.శంకరరెడ్డి, B.లక్ష్మీనారాయణ
సహాయ దర్శకులు	—	S. శ్రీనివాసరావు, B. Sc. V. V. S. మణి
ప్లేబాక్ గాయకులు	—	ఘంటసాల, P. లీలా, జిక్కి, సుశీల, మాధవపెద్ది
అసోసియేట్ నిర్మాత	—	T. పట్టాభిరామరెడ్డి M. A.,
నిర్మాత దర్శకుడు	—	K. V. రెడ్డి B. Sc. (Hons)
నిర్మాణము	—	వాహిని, విజయా స్టుడియోలు
లెబొరేటరి	—	విజయా లేబొరేటరి, R. రంగనాథన్

Gramaphone Records at H. M. V. and COLUMBIA
Recorded on WESTERX Sound System.

పెళ్ళినాటి ప్రమాణాలు

కథా సంగ్రహము

శ్రీ దివాన్ బహద్దుర్ భీమసేనరావుగారి ఇంట్లో రోజు ఏదోగోష్ఠి జరుగుతుంది. వారి దర్జా అది. వారి కుమారుడు ప్రతాప్ మిలటరీ ఆఫీసర్. కూతురు రుక్మిణి పెళ్ళియీడు పిల్ల. తల్లి పోయినప్పటినుంచి ఇంటి అజమాయిషీ ఆమెదే. వారి వంటవాడు పరారయాడు. ఒక వంటవాణ్ణి పంపమని భీమసేనరావు మద్రాసులో తమ చుట్టం సలహాలరావుకు టెలిగ్రాము ఇచ్చాడు.

ఆ సలహారావు ఒక చిత్రమైన మనిషి. ఆయన సలహాలు ముందు చిక్కు తెచ్చిగాని తరువాత మేలు చెయ్యవు. భీమసేనరావుగారింటికి వెళ్ళడానికి వంటవాణ్ణి ప్రయాణమై రమ్మని వుత్తరం రెడీ చేసి వుంచాడు. ఇంతలో వీరి అభిమానపాత్రుడు కృష్ణారావు వచ్చాడు. అతడు M. A. పాసయ్యాడు. ఇంక పెళ్ళే కావాలి. కాని పేదవాడు. కనుక ఇతన్నొకమాటు భీమసేనరావుగారింటికి పంపితే ఇతని విద్యావిశేష చూచి ఆయన మెచ్చుకుంటాడు. రుక్మిణి వరిస్తుంది. ఇతని దరిద్రం తీరిపోతుంది అని సలహాలరావుగారికి ఆలోచన వచ్చింది. ఆయన భార్య అనురాధమ్మకూడా సరేనంది. కృష్ణారావు నావూళే ప్రయాణం కట్టించి అతణ్ణి వర్ణిస్తూ వుత్తరం వ్రాసి, వెళ్ళేటప్పుడుమాత్రం సలహాలరావు వంటవాని కియ్యవలసిన వుత్తరం అతనికిచ్చి పంపాడు. అసలు వంటవాడురాగానే పొరపాటు తెలిసి గాభరాగా సలహాలరావుకూడా ప్రయాణమై వెళ్ళాడు.

కృష్ణారావు వెళ్ళేటప్పటికి భీమసేనరావు ఇంట్లో లేడు. ఇతని పిలుపు విని రుక్మిణి వాకిట్లోకి వచ్చింది. ఇద్దరి చూపులు కలిసాయి. ఒకరినొకరు ఆకర్షించుకున్నారు. కాని అతనిచ్చిన వుత్తరంలో వంటవాడని వుంది. రుక్మిణిమాత్రం నమ్మలేకపోయింది. కాని పనిమనిషి సీతే పట్నం వంటాళ్ళు ఇలా టెక్కుగానే వుంటారంటూ, కృష్ణారావును వంటలోకి దిగమంది. జరి

గిన మోసం తెలిసినా, ఏం వచ్చినా మంచికేనని, ముచ్చటగా కృష్ణారావు వంటలోకి దిగాడు. కానీ, వంట చేతకాదుగా! హాయిగా కూర్చొని దొరల ఫక్కీలో తానుబట్లరుగానూ, రుక్మిణి రాజకుమారిగానూ డాన్సుచేస్తున్నట్టు ఊహాగానం ప్రారంభించాడు. అప్పుడు సలహాలరావు, అసలువంటవాడు వచ్చారు. నిజం తెలిసి రుక్మిణి సిగ్గుపడింది. కృష్ణారావు క్షమాపణ కోరుకున్నాడు. భీమసేనరావు వచ్చి వైనమంతా తెలుసుకుని, కృష్ణారావును మర్యాదచేసి అతిథిగా వుండమన్నాడు.

సలహాలబాబాయంటే రుక్మిణికి తండ్రితో సమానం. ఆయన ప్రోత్సాహంతో, ప్రేమించుకోడంలో కృష్ణారావుతోపాటు రుక్మిణి చురుగ్గానే వుంది. చెల్లెలికి తానే వరుణ్ణి నిర్ణయించినట్టు, త్వరలో వస్తున్నట్టు ప్రతాప్ తండ్రికి జాబు వ్రాశాడు. కాని సలహాలరావు రుక్మిణిని కృష్ణారావుకిస్తే సంతోషిస్తానని అతన్నిగురించి లేనివి వున్నట్టు చెప్పాడు. తరువాత అవన్నీ పచ్చి అబద్ధాలని తెలిసి భీమసేనరావు సలహాలరావుమీద విరుచుకపడ్డాడు. సమయానికి ప్రతాప్ వచ్చి కృష్ణారావు తన మిత్రుడని, అతన్ని గురించే తను రాసిందనీ తండ్రితో చెప్పాడు. ముందు తండ్రికీ, కొడుక్కీ కొంత ఘర్షణ జరిగినా రుక్మిణి ప్రేమించిందని తెలిసి భీమసేనరావు కృష్ణారావుకు పిల్లనివ్వడానికి ఒప్పుకున్నాడు.

ప్రతాప్ చెల్లెలి పెళ్లి కొత్తపద్ధతిలో చేయించాడు. పురోహితుడు వచ్చి సంస్కృతంలో మంత్రాలు చదివించినట్టు కాక, ఒక నాయకుడు వచ్చి, వధూవరులకు తెలిసేట్టు తెలుగులోనే వారిచేత పెళ్లిప్రమాణాలు చేయించి కళ్యాణం జరిపించాడు. చివరకు వధూవరులను చేరదీసి, మానవ మాత్రులకు జీవితంలో ఒకసారైనా ప్రేమగండం దాపరించక తప్పదనీ, ఈ పెళ్లిప్రమాణాలను స్మరిస్తూవుంటే ఆ గండం రాదని వారికి బోధించాడు. మనోనిగ్రహం వున్నవాళ్ళని ఈ గండాలు ఏంచెయ్యవని కృష్ణారావు ఛాలెంజిగా అన్నాడు. ఈ ధీమాలు కాదు, ఈ పెళ్ళిప్రమాణాలను మరువకుంటేనే మీకు తారకమని కృష్ణారావును నాయకుడు హెచ్చరించాడు.

పట్నంలో సలహాలరావు ఇంట్లోనే రుక్మిణీ కృష్ణారావుల కాపురం ఏర్పాటయింది. ఆయన మేనేజర్‌గా వున్న అందాలు, అలంకారాలు షాపు

లోనే కృష్ణారావుకు సెక్రెటరీ ఉద్యోగం లభించింది. తన తెలివితేటలతో కొద్దికాలంలోనే ప్రొప్రైటర్ నందాగారి మెప్పు సంపాదించాడు. కానీ, పెళ్ళయిన కొత్తరోజులుకదా! ఆఫీసులోనూ కృష్ణారావుకు రుక్మిణే తలపుకు వస్తూంది. వెంటనే గుండెనొప్పని శెలవుచీటీపెట్టి కృష్ణారావు ఇంటికి వచ్చాడు. ఇంట్లో రుక్మిణితో కలిసి ప్రేమగీతం పాడ్తూవుండగా డాక్టర్ను తీసుకొని నందాగారు వచ్చారు. డాక్టరు కృష్ణారావుని పరీక్షించినట్లు నటించి ఇది ప్రేమజాడ్యం, దీనికి మందు నవదంపతులు ఒక పక్షంరోజులు ఇచ్ఛావిహారం చెయ్యాలని మందుచీటి వ్రాసిచ్చాడు. నందాగారు కృష్ణారావుకు పదిహేను రోజులు శెలవిచ్చి అలా నడుచుకోమని చెప్పి వెళ్ళిపోయారు. ఇంకేం! రుక్మిణీ కృష్ణారావుల ఆనందవిహారంలో కాలచక్రం గిరగిర తిరిగింది. వారికి ముగ్గురు పిల్లలు కలిగారు. అంతా సుఖంగా వుంది.

కానీ, పెళ్ళినాడు నాయకుడు హెచ్చరించిన ప్రేమగండం కృష్ణారావుకు ఇప్పుడు దాపరించబోతుందా అన్నట్లు నందాగారి షాపులోకి రాధాదేవి B. A. నవయువతీమణి, టైపిస్టుగా వచ్చింది. వస్తూనే కృష్ణారావుతో పేచీ వచ్చింది. విద్యావంతుల మర్యాదగా తాను షేక్ హేండ్ ఇయ్యబోతే అతను చేతులు ముడుచుకొని పొడిగా నమస్తే అన్నాడు—తనది చపలస్వభావమూ, అతనిది నిగ్రహము అయినట్లు! ఆ భీష్ముల వారికి స్త్రీల నెలా గౌరవించాలో నేర్పి తీరాలనుకుంది.

ఆఫీసులో గుమాస్తాలు, అమ్మకాలు, ప్రకటనలు, అదివరకు మసి పాతలుగా వుండేవాళ్లు ఇప్పుడు పెళ్లికొడుకుల్లా ముస్తాబై వచ్చి రాధతో చిలిపిగా ప్రవర్తించడం మొదలెట్టారు. అందుకు విరుగుడు రాధ వాళ్ళని కోతుల్లాగా ఆడించడం మొదలెట్టింది. కృష్ణారావు అది చూచి, రాధను చీవాట్లు పెట్టి ఆవిడ సీటు తన ప్రక్కకే మార్పించాడు, ఇక ఆవిడ బుద్ధిగా వుండక తప్పదన్నట్లు. ఈ చర్యకు రాధ తల షంకించింది.

కృష్ణారావు గృహజీవితం హుషారుగా లేదు. రుక్మిణికి ఇల్లేమో, పిల్లలేమో! కులాసా షికార్లకు ఆమెకు తీరిక లేదు. కృష్ణారావుమాత్రం పెళ్లయిన కొత్తలో తామనుభవించిన మధుర క్షణాలకోసం తహతహలాడుతుంటాడు. ఆ పరిస్థితిలో రుక్మిణి పుట్టింటికి వెళ్ళడం తటస్థించింది.

ఆఫీసులో తను నిశ్చలంగావున్నా రాధే తన్ను నిలవనీయడం లేదన్నట్టు కృష్ణారావు మళ్లీ ఆమెను మందలించాడు. ఆఫీసులో పనిచేసే ఆడవాళ్ళకు మనోనిగ్రహం వుండాలని నీతులు చెప్పాడు. సరే, ఈయనగారి మనోనిగ్రహం ఏమిటో పరీక్షించాలని రాధ కృష్ణారావుతో చెలగాటం ప్రారంభించింది. అర్ధరాత్రి అతని ఇంటికి వెళ్ళి, "ఆఫీసులో నేనుండడం మీకిష్టంలేనట్టుంది. ఎందుకీ జన్మ ?" అని ఆత్మహత్య చేసుకోబోయినట్టు నటించింది. కృష్ణారావు గాబరాపడి, ఆమెనువారించి "పైకి కఠినంగా వున్నా, లోపల మీ చెలాకీని మెచ్చుకుంటూనే వున్నాన"ని మనస్సు విప్పి చెప్పాడు. రాధ గుండె కుదటపడ్డట్టు నటించింది. ఆ సమయంలో సలహాలరావుగారు రావడం, కృష్ణారావు రాధను దాచడం, గుట్టు బయట పడిపోయేటంత పనిజరిగి చివరికి రాధ చమత్కారంతో ఆ గండం గడిచిపోయిందిగాని ఈ సంఘటనతో కృష్టారావులో మాత్రం ఒకచెప్పరాని కపలిక కలిగింది.

కృష్ణారావుకు రాధ ఒక సమస్యగా ఏర్పడింది. ఇంటికి టీపార్టీకి పిలిచింది. వెళ్ళడమా, మానడమా అని! ఇటు పెళ్ళినాటి ప్రమాణాల విషయమై నాయకుని హెచ్చరిక ప్రతిధ్వనిస్తూంది. అటు ఆనంద నాట్యాలతో రాధ తనను ఆకర్షిస్తున్నట్టు మధురభావాలు కలుగుతున్నాయి. అశే వెళ్ళాడు! కానీ ఏముంది? రాధ తన స్నేహితురాలు సరితతో కలిసి కాస్సేపు ఇతన్ని ప్రలాపించి ఇప్పటికీ పరీక్ష చాలన్నట్టుగా చమత్కారంగా సాగనంపుతోంది. కృష్ణారావుకు మాత్రం ఆమె చెలగాటంతో ఉబలాటం హెచ్చుతోంది.

ఇక రాధతో కలిసి కృష్ణారావు చెడిపోతాడని భయపడి సలహాలరావు రుక్మిణిని వెంటనే రమ్మని ఉత్తరం వ్రాయించాడు. రుక్మిణి ఇంటికి వచ్చేటప్పటికీ చిత్రంగా రాధకూడా అక్కడేవుంది. కృష్ణారావు తందరబిందరలాడిపోయాడు. రాధ చమత్కారంగా ఆఫీసుపనిమీద వచ్చినట్టు నటించి అతన్ని అర్జంటుగా రమ్మనిచెప్పి వెళ్ళింది. అది సాకుతీసుకొని కృష్ణారావుకూడా ఆమెవెంటే ఆమె ఇంటికి వెళ్ళాడు. కానీ సూటిగా ప్రేమను ప్రకటించుకోలేక ఏదో ఊహాగానంచేస్తూ అక్కడేతిష్ఠవేశాడు. ఈ మాటు సరిత రాధఅవ్వలాగ నటించి తిట్లపంచాంగంతో కృష్ణారావును గాడలుగొట్టి సాగనంపింది.

రుక్మిణి బాధపడుతుందేగాని, కృష్ణారావును పల్లెత్తుమాటంటానికి కూడా ఒప్పుకోటంలేదు. కనుక సలహాలరావుగారు ప్రతాప్‌కు ఒక ఆకాశరామన్న వుత్తరం వ్రాశారు. అతను వచ్చి కృష్ణారావుకు బుద్ధిచెప్తాడని అతని నమ్మకం. ప్రతాప్ వచ్చేటప్పటికి అంతా శాంతంగా వుండడం చూచి ఆ ఉత్తరం ఎవరో గిట్టనివాళ్ళు వ్రాశారనుకున్నాడు. కాని సాయంత్రం పార్కులో కృష్ణారావు రాధతో వుండడం కళ్ళారా చూసాడు. అక్కడే ఉతికేద్దామనుకుంటే కృష్ణారావు తప్పించుకు పోయాడు. ఇంటికి వచ్చికూడా చెల్లెలికి జడిసి అతన్ని ఏమి చేయలేక పోయాడు.

కాని సలహాలరావు సలహాతో ప్రతాప్ రాధ ఇంటికి వెళ్ళి కృష్ణారావును విడిచిపెట్టమని దబాయించాడు. ఆమె ఎదురు ప్రశ్నలకు జవాబు చెప్పలేక జాలిగా బ్రతిమాలాడు. చివరికి "నీకు కావలిసింది డబ్బేగా" అని అయిదువేలు అక్కడ పడేసి వచ్చిన పని అయిపోయినట్టే వెళ్ళిపోయాడు. ఈ చర్య తనకు అవమాన కరమైనా అతని బోళాతనం చూచి రాధ జాలిపడింది. అందుకు ప్రతీకారం కృష్ణారావుకే చెయ్యాలనుకుంది.

తరువాత, దుర్బుద్ధితో తనకు ప్రెజెంటిచ్చిన అమ్మకాలు, ప్రకటనలను ఇంటికి పిలిపించి, వాళ్ళ వెకిలి ప్రేలాపనలు నందాగారికే వినేట్టు చేసి ఆయన చేతే గట్టిగా బుద్ధి చెప్పించి, వాళ్ళచేతే "మాతృదేవోభవ" అనిపించుకుంది.

అందాలు, అలంకారాలు షాపు రజతోత్సవంలో అందాలపోటి జరుగుతోంది. నెగ్గినవారికి ఆంధ్రసుందరి బిరుదు, సువర్ణపతకం ఇస్తారు. సుందరీమణులు అందాలనుప్రదర్శిస్తున్నారు. రాధాకృష్ణారావులు గ్రీన్ రూమ్‌లో ఉన్నారు. వారిహొత్తు సహించలేని అమ్మకాలు, ప్రకటనలు రుక్మిణి అక్కడికి వచ్చేటట్టుచేసారు. తన ప్రేమను వెల్లడిస్తూ కృష్ణారావు రాధ భుజాలు పట్టుకోడం రుక్మిణి చూసి, నిలువలేక, దుఃఖావేశంలో దారితప్పి స్టేజిమీదికే వెళ్ళింది. అంతా చప్పట్లుకొటారు. రుక్మిణి గాభరాగా స్టేజి దిగి వెళ్ళిపోయింది. జడ్జీలు మెడల్ ఆమెదేనని నిర్ణయించారు. ఇదేమిటో అర్థం కాక "కృష్ణారావును చూసి రమ్మని" ప్రతాప్‌ని పంపి సలహాలరావు రుక్మిణివెంట వెళ్ళాడు. ప్రతాప్ వెళ్ళి రాధా కృష్ణారావుల సంవాదం

చాటుగా విన్నాడు. రాధ కృష్ణారావు బుఱ్ఱను బాగా మరమ్మతు చేసింది. అతని తప్పు ఆతనికీ తెలిసివచ్చింది. చివరికి "మిమ్మల్ని విడిచిపెట్టమని మీ బావగారిచ్చింది మీరే తీసుకవెళ్ళి, అయన మొఖానకొట్టి నిజంచెప్పండని" ప్రతాప్ ఇచ్చిన డబ్బు కృష్ణారావుకిచ్చింది. కృష్ణారావు ఖిన్నుడై, క్షమించండంటూ వెళ్ళిపోయాడు. ఉత్సాహంగా ప్రతాప్ లోపలికి వెళ్ళి రాధకు షేక్‌హాండ్ ఇచ్చి మీవంటి యువతి ఒకరున్నా చాలు దేశం బాగుపడ్తుందనీ, మీరు నాకు నచ్చారనీ చెప్పాడు. రాధకు ఆతడూ నచ్చాడు.

అబ్బ! రావలసిన ప్రేమగండం రాధద్వారానే వచ్చి, రాధద్వారానే పోయింది, భయం లేదని నిర్మలమనస్సుతో రుక్మిణిని తలచుకుంటూ కృష్ణారావు ఇంటికి వచ్చేటప్పటికి రుక్మిణి ఇంట్లో లేదు. ఇల్లాంతా గాలించాడు. టేబిల్ మీద ఉత్తరంచూస్తే అది రుక్మిణి ఆత్మహత్య చేసుకోబోతూ తనకు వ్రాసినట్లుంది. హతాశుడై కృష్ణారావు అల్లాడిపోతున్నాడు. మరి రుక్మిణివెంటే వచ్చిన సలహాలరావుమాత్రం దుప్పటి బిగతన్ని నిద్రసేవిస్తున్నాడు. ఆయన చేసిన ఘనకార్యం ఏమిటో, నడిపిస్తున్న నాటకం ఏమిటో తెరమీద చూసి ఆనందించవలసిందే.

★ పాటలు ★

1. పాట :

శ్రీమంతురాలివై చెలువొందుమాతా
మమ్ము దీవించుమా మా ఆంధ్రమాతా.
కృష్ణ గోదావరీ హంద్రి నాగావళీ
తుంగభద్రా పెన్న నదుల పుణ్యమున
నిత్య కళ్యాణమూ పచ్చతోరణమూ
ఇంటింట విలసిల్ల జయము కోరెదమూ ॥శ్రీ॥

కృష్ణరాయలనాటి భువనవిజయాలు
రాజరాజులనాటి ఘనరాజసాలు
నన్నయ్య తిక్కన్న పోతన్న ప్రతిభలు
యీనాడు వెలియంగ శుభము కోరెదము ॥శ్రీ॥

ముక్కోటి ఆంధ్రుల ముక్కోటి ప్రభలు
ఏక దీప్తిని గాంచి తేజరిల్లగను
ఎన్న డారని జ్యోతి నీయింట నిలిపి
సన్నుతులు గాంచగల వరము కోరెదము ॥శ్రీ॥

2. కృష్ణరావుపాట :

కావనగానే సరియా యీ పూవులు నీవేగా దేవీ
చల్లగ చూడాలీ - పూవులు
అందుక పోవాలి - దేవి ॥క॥

మల్లె సుగంధం మనసున జల్లి
మళ్ళీ అల్లరి తగునా ||చ||

మలయా నిలముల లాలనవలెనే
వలపులు హాయిగ కురిసి
కలికి చూపులను చెలిమిని విరిసి
చిలిపిగ దాగుట న్యాయమా ||చ||

తెలి మబ్బులలో జాబిలి వలెనే
కళకళ లాడుచు నిలిచి
జిలిబిలి సిగ్గుల పిలువక పిలిచి
పలుకక పోవుట న్యాయమా ||చ||

3. రుక్మిణిపాట

బృందావన చందమామ ఎందుకోయి తగవూ
అందమెల్ల నీదే - ఆ నందమెకద నాది
మంద మంద హాసములె - వెన్నెలలై విరియ
రస తరంగ రంగములను రాసలీల వెలయ
యదుసుందర నీరూపము - కనువిందు కదోయి ||బృ||

చిరుగజ్జెల గలగలలో - కల కల రవములు చెలగ
మురళీరవ మధురిమలో - రాగసుఖము కలుగ
మనమోహన నీ గానము - మధుర మధురమోయి ||బృ||

4. (కృష్ణారావు - రుక్మిణి)

కృష్ణ : వెన్నెలలోనే వేడి యేలనో
రుక్మిణి : వేడిమిలోనే చల్లనేలనో

కృష్ణ : ఈ మాయ యేమో జాబిలీ

రుక్మిణి : ఈ మాయ యేమో జాబిలీ

కృష్ణ : వెన్నెలలోనే విరహ మేలనో

రుక్మిణి : విరహములోనే హాయి యేలనో॥ ॥ఈమాయ॥

కృష్ణ : మొన్నటికన్న నిన్న వింతగా నిన్నటికన్న నేడువింతగా
నీ సొగసూ నీ వగలూ హాయిహాయిగా వెలసేనే
వెన్నెలలోనే వేడి యేలనో

రుక్మిణి : వేడిమిలోనే చల్ల నేలనో॥ ॥యీమాయ॥

రుక్మిణి : రూపముకన్న చూపుచల్లగా చూపులకన్నచెలిమికొల్లగా
నీ కళలూ నీ హొయలూ చల్లచల్లగా విరిసేనే
వెన్నెలలోనే విరహమేలనో

కృష్ణ : వెన్నెలలోనే హాయి యేలనో॥ ॥యీమాయ॥

5. (కృష్ణరావు – రుక్మిణి)

కృష్ణ : నీతోనే లోకము, నీతోనే స్వర్గము
ఆదె మన జీవనము, అదె మన ఆనందమూ
తనువు నాదిగా, మనసు నీదిగా
ప్రేమనగరిలో రేయి పగలుగా, పగలె రేయిగా
ఓ చెలీ! నీ చలవే, నీతో కాలంవే ॥నీతోనే॥
కనులు తెరచినా, కనులు మూసినా,
ఆఫీసులో ఫైళ్ళు తెరచినా, మరల మూసినా
ఓ సఖీ! నీ తలపే, నీపై వలపే ॥నీతోనే॥
నీవేలే నా లోకము!

రుక్మిణి : నీవేలే నా స్వర్గమూ

6. (రుక్మిణి - బృందము)

లాలి మా పాపాయి ఆనందలాలీ
దీవించి సురలెల్ల లాలించు లాలీ ॥లాలి॥

చిన్నారి పాపాయి చిరునవ్వు విరియా
పొన్నారి పాపాయి సొగసులు కురియా
మురియుచు శ్రీ లక్ష్మి సిరుల నందీయా ॥లాలి॥

తాతయ్య ధనములకు దాతవైనావు
మామయ్య కీర్తులకు సాటివైనావు
మహారాజు వే నీవు గారాల పాప ॥లాలి॥

తొట్టిలో నిలువక దోగాడు పాపా
చల్లని వెలుగులా జాబిల్లి వేలే
వన్నె చిన్నెలతోడ వర్ధిల్లు మా పాపా ॥లాలి॥

7. పూలపాట :

అరణా ఆణా అయినా సరసమైన బేరమయా
మల్లెపూల దండలయా మళ్ళీవస్తే దొరకవయా ॥అరణా॥
అయ్యగారి పూజలకు అమ్మగారి సొగసులకు
చాలమంచి పూవులయా జాలమింక నేలనయా
మామయ్యా, బావయ్యా మల్లెమజా చూడవయా ! ॥అరణా॥

కోపమైన తాపమైన మాపటికే తీర్చునయా
కవ్విస్తూ నవ్విస్తూ ఆలు మగల కూర్చునయా
మనసుమీద మచ్చు జల్లు దినుసు చాలకలదయ్యా
ఏమయా బావయ్యా ! మల్లెమజా చూడవయా ॥అరణా॥

ముసలి పడుచు అయిన నేమి పడుచు ముసలి అయిన నేమి
చలచలగా మెలమెలగా వయసు మళ్ళీ వచ్చునయా
పెళ్ళినాటి సొగసులతో వొళ్ళో వచ్చి వ్రాలునయా
ఏమయో-మామయ్యా, మల్లెమజా చూడవయా ॥అరణా॥

3. కృష్ణారావు - ఊహాగానం (రాధకృష్ణుల నృత్యం)

కృష్ణా! నీకూ భయమేనా! కృష్ణా!
ఏదో తెలియక పిలిచితి నోయీ
మీదికి రాకోయీ! కృష్ణా! వాదుకు రాకోయీ ॥ఏదో॥
శిరమున పింఛము నొసటన తిలకము
ఉరమున కౌస్తుభమూ
సుందర రూపము చూడగ నేమది
తొందర పడెనోయీ ॥ఏదో॥
సరస నటనలూ సరస రాగములు
సరసాలాపములూ. . .
మురళీ రవళిని వినగానే హృది
పరవశించె నోయీ ॥ఏదో॥

9. కృష్ణారావు-ఊహాగానం (రాధకృష్ణుల నృత్యం)

కృష్ణుడు: రావే ముద్దుల రాధా: నా
ప్రేమరాశివి నీవెగా నవ
రత్నాల రాశివీ నీవెగా ॥రావే॥
రాధ: పోవయ్యా! శ్రీ కృష్ణా! నీ
సరసాలన్నీ మాయలే, నువు
దూరాన ఉంటే మేలులే ॥పో॥

కృష్ణుడు : వనిత లెవ్వరు నీసాటి రారే
నిన్నె నిరతము నే కోరినానే
కోపమేలా దయగను బాలా
తాపమింకా నే తాళజాల ॥రావే॥

రాధ : మనసు నిలకడ సుంతైన లేదా
తరుణి తరుణితో ఈ ఆటలేనా
చాలు చాలును ఈ మాట లేలా
నీటి మూటలు నే నమ్మజాల ॥రావే॥

10. సలహాలరావు రావణబ్రహ్మగా పద్యం

సీ॥ సుర యక్ష గంధర్వ సుందరీమణు లెంద
రందరి నేనె పెండ్లాడినాను
చెంగును బట్టి నే చె[illegible]
రంభ అందముకూడ రాణ గాంచె
నావంటి బలశాలి నావంటి రసికుడు
ముల్లోకముల లేడె మోహనాంగి
నీ విష్టపడకున్న నిన్ను నే ముట్టను
ప్రేమింపవే నిన్ను వేడుకొనెద

ఉండవే మండోదరి


తే.గీ॥ సవతి వచ్చె నటంచును జడియ కబల
చూడుమా, దీనిచేత నీ కూడిగంబు
త్వరర చేయించి శిరమున నిను దరింతు
నింక జంకేల గొంకేల పంకజాక్షి

నటీనటులు

A. నాగేశ్వరరావు	—	జమున
S. V. రంగారావు	—	రాజసులోచన
రమణారెడ్డి	—	ఛాయాదేవి
R. నాగేశ్వరరావు	—	సీత
Ch. కుటుంబరావు	—	లీలాబాయి
అల్లు రామలింగయ్య	—	సురభి కమలాబాయి
బాలకృష్ణ	—	బాలకుమారి
పేకేటి శివరామ్	—	రత్నపాప
డాక్టర్ శివరామకృష్ణయ్య	—	బేబి సీత
బొడ్డపాటి	—	A. L. నారాయణరావు
జవ్వాది రామారావు	—	M. V. N. చారి

A. V. సుబ్బారావు తదితరులు

శ్రీ సత్యనారాయణ ప్రింటింగు వర్క్సు, విజయవాడ-1.



శ్రీ సత్యనారాయణ (ప్రింటింగు వర్క్సు), విజయవాడ-1.